# ఎర్రనేలలు సస్యశ్యామలం

- మంచిర్యాల జిల్లాలో 200 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా అధిక సాంద్రత పత్తి సాగు
- పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే రైతన్నకు వ్యవసాయం అనుకూలం



అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తల బృందం



బెల్లంపల్లి మండలంలోని మాలగురిజాల గ్రామంలో సాగవుతున్న అధిక సాంద్రత పత్తి పంట

బెల్లంపల్లి రూరల్, అక్టోబర్ 30 : నిన్న, మొన్నటి వరకు బీడువారిన తెలికపాటి ఇసుక, ఎర్రనేలలు సస్యశ్యామలం కానున్నాయి. వ్యవసాయ పరిశోధనా సంస్థల ఫలితంగా రైతన్నలకు మంచి రోజులు రానున్నాయి. ఎందుకూ పనికి రాని నేలల్లోనూ తెల్లబంగారాన్ని పండించే పద్ధతులను వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పరిచయం చేస్తున్నారు. వ్యవసాయ పరిశోధనా సంస్థల పరిశోధనల్లో భాగంగానే మంచిర్యాల జిల్లాను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. 120 మంది రైతులతో బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట, భీమిని, కాసిపేట మండలాల్లో ప్రయోగాత్మకంగా 200 ఎకరాల్లోనూ అధిక సాంద్రత పత్తి సాగుకు శ్రీకారం చుట్టారు. పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే రైతులు అధిక సాంద్రత పత్తి సాగు వైపు మొగ్గు చూపనున్నారు. భారత పత్తి పరిశోధనా సంస్థ(నాగ్‌పూర్) ప్రయోగాత్మకంగా దేశంలోని కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా అధిక సాంద్రత పత్తి సాగు వైపు రైతులను సన్నద్ధం చేస్తూ ఆశించిన ఫలితాల కోసం కసరత్తు చేస్తున్నది. భారత పత్తి పరిశోధనా సంస్థ నుంచి గుర్తింపు పొందిన రాశీసీడ్స్, మైకోసీడ్స్ కంపెనీల నుంచి విత్తనాలను అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేస్తున్నది.

## అధిక సాంద్రత పత్తి సాగు వల్ల లాభాలు

అధిక సాంద్రత పత్తి సాగు వల్ల కాలం కలిసి వస్తుంది. ఒకేసారి అధిక మొత్తం కటింగ్ చేసుకునే అవకాశం ఏర్పడుతోంది. మామూలు పత్తితో పోల్చుకుంటే ఎక్కువ మొక్కలు నాటుకునే అవకాశం ఉంది. తేలికపాటి, ఎర్ర నేలల్లోనూ పత్తి సాగుకు అనుకూలంగా ఉండి మేలురకం పత్తి చేతికందే అవకాశం ఉంది. మెపిక్ బాక్లోరైడ్ మందును పిచికారీ చేయడం వల్ల మొక్క ఎదుగుదలను నియంత్రించి కాయ పగిలే విధంగా చేస్తుంది. తొందరగా దిగుబడి వస్తోంది. ఒకేసారి పత్తిని ఏరే అవకాశం ఏర్పడడం వల్ల పెట్టుబడి తగ్గించుకోవచ్చు. నాణ్యత గల పత్తి చేతికందడంతో రైతులకు మంచి ధర వచ్చే అవకాశం ఉంది. నవంబర్, డిసెంబర్ మాసాల్లో పత్తి తెంపడంతో గులాబీ రంగు పురుగు, చీడపీడలను పూర్తిగా నియంత్రించుకోవచ్చు. ఒకేసారి పగలడం వల్ల పత్తి కోత మిషన్లకు చాలా అనుకూలంగా ఉంటుంది.

### కూలీల కొరత ఉండదు..



*అధిక సాంద్రత పత్తి రైతులకు చాలా ప్రయోజనకరం. ఒకేసారి కూలీలతో పంటను తెంపుకునే అవకాశం ఉంది. దీనివల్ల కూలీల కొరత సమస్య నుంచి రైతులు తేలిగ్గా బయటపడొచ్చు. ఎకరానికి మొదటి దశలో 12-14 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. రెండో దశలో 2-4 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. రైతులకు సీడ్స్ అందించేందుకు చాలా కంపెనీలు ముందుకొస్తున్నాయి. మొదటి పంట తీశాక వెంటనే రైతులు రెండో పంటగా మళ్లీ అధిక సాంద్రత పత్తిని సాగు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఇలా పంటల మార్పిడి వల్ల భూసారం పెరిగి నాణ్యమైన పత్తి దిగుబడులు రైతులు పొందే అవకాశముంది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా మేము ప్రయోగాత్మకంగా రైతులతో చేయిస్తున్న అధిక సాంద్రత పత్తి సాగు మంచి ఫలితాలిస్తే భవిష్యత్‌లో తేలికపాటి, ఎర్ర నేలలు రైతులకు సాగుకు అనుకూలంగా మారనున్నాయి.*

**- కోట శివకృష్ణ, కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, బెల్లంపల్లి.**

---

# ధాన్యపురాశులు

- పెరిగిన వానకాలం వరి దిగుబడి
- 2016-17లో 60,832 మెట్రిక్ టన్నులు
- 2023-24లో రానున్న 3,46,376 మెట్రిక్ టన్నులు



మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 30 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మంచిర్యాల జిల్లాలో సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. జిల్లా ఏర్పడే నాటికి వానకాలంలో సాగు 92,996 ఎకరాలు కాగా.. ఈ ఏడాది 4,57,618 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. జిల్లాలో ప్రధాన పంటలైన వరి, పత్తి సాగు పెరుగుతూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా ధాన్యం కొనుగోళ్లు చేస్తుండడంతో రైతులు ఇబ్బంది లేకుండా వరి సాగు చేస్తూ సర్కారుకే ధాన్యాన్ని విక్రయిస్తూ మద్దతు ధర పొందుతున్నారు. జిల్లా ఏర్పడినప్పుడు వానకాలంలో 31,254 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా.. ఈ ఏడాది 3,46,376 మెట్రిక్ టన్నులకు చేరిందంటే వరి సాగు ఎంత మేర పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.

## సత్ఫలితాలిచ్చిన కరంట్

తెలంగాణ ప్రభుత్వం చెరువుల పూడికతీత కోసం మిషన్ కాకతీయ పథకం ప్రారంభించి చెరువుల్లో పూడికతీయడం, చెరువు కట్టల బలోపేతం, మరమ్మతు పనులు చేపట్టింది. దీంతో వర్షం నీటిని నిలువ చేసుకునే అవకాశం ఏర్పడింది. గత ప్రభుత్వాల హయాంలో కనీసం మూడు గంటలు కూడా సాగుకు విద్యుత్ ఇవ్వకపోవడంతో పొలాల వద్దే రాత్రుళ్లు బస చేయాల్సి వచ్చేది. రైతుల కష్టాలు గమనించిన ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు 24 గంటల విద్యుత్ సాగుకు అది కూడా వానకాలం, ఎండాకాలం ఇవ్వడం మొదలు పెట్టడంతో రైతులు ఆనందంగా సాగు వైపు దృష్టిసారించారు. భూమిలో నీటి నిల్వలు పెంచేందుకు గోదావరిపై ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడంతో సుమారు 165 కిలోమీటర్ల పొడవున నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో ఏటేటా సాగుతోపాటు దిగుబడి పెరుగుతూ వస్తోంది.

## పెరిగిన దిగుబడి

మంచిర్యాల జిల్లాలో 65 శాతం నల్లరేగడి, 30 శాతం ఎర్రరేగడి, ఐదు శాతం ఇసుక నేలలు ఉన్నాయి. ఈ యేడాది వానకాలం 4,57,618 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 1,57,444 ఎకరాలు సాగవగా.. ఇందులో 96,466 ఎకరాలు దొడ్డు రకం, 60,968 ఎకరాలు సన్నరకం, 10 ఎకరాల్లో సీడ్ విత్తనాలు సాగు చేశారు. ఈ యేడాది 3,46,376 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. బెల్లంపల్లి మండలంలో 10,616 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుండగా.. కాసిపేటలో 3,643, తాండూరులో 8,602, భీమినిలో 7,639, కన్నెపల్లిలో 15,810, నెన్నెలలో 16,941, వేమనపల్లిలో 12,510, భీమారంలో 12,976, చెన్నూర్‌లో 39,236, జైపూర్‌లో 34,457, కోటపల్లిలో 20,489, మందమర్రిలో 13,511, దండేపల్లిలో 53,197, హాజీపూర్‌లో 18,729, జన్నారంలో 38,634, లక్షెట్టిపేటలో 36,695, మంచిర్యాలలో 990, నస్పూర్‌లో 1,699 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుంది. ఇందులో దొడ్డురకం 2,12,226 మెట్రిక్ టన్నులు.. 1,34,129 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం రానుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు.

**వానకాలం సీజన్‌లో వరి సాగు(ఎకరాలు), ధాన్యం(మెట్రిక్ టన్నులు)**

| సంవత్సరం | సాగు | వరి సాగు | దిగుబడి |
|---|---|---|---|
| 2016-17 | 92,996 | 27,652 | 60,832 |
| 2017-18 | 2,42,103 | 73,871 | 1,62,516 |
| 2018-19 | 2,73,762 | 97,723 | 2,24,762 |
| 2019-20 | 3,70,569 | 1,61,680 | 3,71,864 |
| 2020-21 | 3,83,248 | 1,64,238 | 3,77,747 |
| 2021-22 | 3,50,206 | 1,62,625 | 3,74,037 |
| 2022-23 | 3,36,269 | 1,57,593 | 3,78,223 |
| 2023-24 | 4,57,618 | 1,57,443 | 3,46,376 |
| | 25,06,771 | 10,02,825 | 22,96,359 |

---

# స్వచ్ఛతలో భేష్

- స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డుకు ఎంపికైన కిష్టంపేట
- పల్లె ప్రగతితో అభివృద్ధి
- రూ. 10 లక్షల పురస్కారం
- జిల్లా స్థాయిలో ఎంపికైన మరో 15 గ్రామాలు

హాజీపూర్, అక్టోబర్ 30 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'పల్లె ప్రగతి'తో గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు స్వచ్ఛతలోనూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో గ్రామాలు ప్రగతిపథంలో దూసుకెళ్తున్నాయి. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని కిష్టంపేటతో పాటు జిల్లాలో మరో 15 గ్రామాలు రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యాయి. నిత్యం పారిశుధ్య పనుల నిర్వహణ, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల నిర్మాణం, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల పెంపకం, చెత్తతో ఆదాయంవంటి సౌకర్యాలు సమకూర్చుకొని ముందుకెళ్తున్నాయి.



చెత్తను సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రభుత్వం కిష్టంపేటకు రూ. 10 లక్షల పురస్కారం ప్రకటించింది.

### విప్, ప్రజల సహకారంతోనే..



*ప్రభుత్వ విప్, గ్రామ ప్రజల సహకారంతోనే కిష్టంపేటకు రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు మా ఊరికి రూ. 10 లక్షల పురస్కారం ప్రకటించారు. ఈ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతాం. మా ఊరికి రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చినందుకు సంతోషంగా ఉంది.*

**- బుర్ర రాకేశ్‌గౌడ్, సర్పంచ్, కిష్టంపేట**

### అవగాహన కల్పించాం



*మా ఊరిలో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నాం. తడి-పొడి చెత్తను వేరు చేసి జీపీ సిబ్బందికి అందించాలని మహిళా సంఘాలకు వివరించాం. అలా వేరు చేసిన చెత్తను వర్మీ కంపోస్ట్ షెడ్డుకు తరలించి ఎరువును తయారు చేస్తున్నాం. ఈ ఎరువును హరితహారంలో నాటిన మొక్కలకు వినియోగిస్తున్నాం. రోడ్లపై నీరు నిలువకుండా ఇంటింటికీ ఇంకుడు గుంత నిర్మించాం.*

**- రామటెంకి మల్లీశ్వరి, సర్పంచ్, టీకన్నపల్లి**